# ఆరికేం మారాజులు

"పానీలే పిల్లలుగల కుటుంబం. అట్ట కలిసొచ్చింది గనక పరువు దక్కింది. పాపం, యింతకు ముంగల నాగరత్తమ్మా బిడ్డలు ఎన్ని అగసాట్లు బడిందీ ఎవురికి తెలవదు? మరదేందో సొరాజ్జం సొరాజ్జం అనరుత్తా సబలు బెట్టేతలికి, అందిన పెతోణ్ణీ బట్టుకుని కొట్టో ఏసిబారేత్తిరి. కాత్తె వుండ మారాజుగందా సబల గుబులు యీ రంగయగోరికి దేనికి సెప్పరాదూ? కొట్టో పణ్ణూకితిరి. ఏనిగంటి మద్చి కాస్తా ఆవజాన నీలక్కబోయి బెయిటబడేతలికి బెమ్మాణ్ణమయిపాయె. చరే. గెణ్డం గెడిసిందిగందా అనుకుంటా వుండేతలికే కద్దరు కద్దరు కాంగిరేసు కద్దరంటూ యింటో పెతోర్నీ ముతగ్గుడ్డ కట్టమంటా వొచ్చి కూకుండె. ఎటనయిన నాగరత్తమ్మగోరు సావుబతుకులు తెల్చిందిగనకా ఎదుర్దిరిగి కాత్తె అదిదీ సరుదుకుంటా ఎల్లి పానిచ్చింది. మరి రంగయగోరి కాక సూడబోతే యాడా నిలబడకనే పాయెగా! రాటాలనీ మగ్గాలనీ– అదేందో వుత్తరాది కాంగిరీసనీ, యాడా ఆ కరుజుకు లెక్క తెలవందే. యిదేందని ఊళ్లో పెతోరనుకుండారు. ఏణ్ణర్దం కొట్టో బడుంటే, పెళ్లాం బిడ్డల దిక్కు మొక్కు సూసేవో డెవురో తెలవకా– కాత్తె నాగరత్తమ్మగోరి తమ్ముడు యాలకు ఆదుకుండాడు గాబట్టి చర్పోయింది– వడ్డీలు పెరగనే బెరిగి బంగారమంటి మాగాని కాత్తా సగానికి సగం తరుక్కుబాయె. క్లె! ఎట్టాటి మారాజులయినా సూత్తా సూత్తా వుంటేనే ఆవజాన దిగజారిపోల్చిందే గందా! ఏందోలే. ఏనాడో నాగరత్తమ్మ బిడ్డలు ఆమాత్తరం పున్నెం జేసుకుండారు గనకా మళ్లీ రోజులు కలిసొచ్చినయి. మరేంది! మా గూడెంలో మద్చులుండారు దేనికీ? ఎన్నేళ్ళు కొట్టుకుండా కడుపు కక్కుర్తితోనే చర్పోతావుండె. యింతకీ బెమ్మదేవుడి బిసగానీ యియ్యాల పాసిపన్జేసుకునే ఎంకాం గారెలు బూరెలు రామంటే వొత్తయ్యేట్టా? యింగా నయం. నాగరత్తమ్మ గోరి దరమమంటా యిన్నాలు కాత్తెరేపిటాల మాపిటాల కడుపన్నా అట్టట్ట నిందుతావుంది... ఆయన బొయ్యాదుగందా. ముండమోపిదాన్ని ఎటనోగట్ట నేనూ జారిపోతా. ఆ మురుపేందో ఆ సుకవేందో ఆ బతికినన్నాలూ అట్టట్ట ఎల్లిపాయె.... బువలోకి ఏదుండా వుండకబొయినా పొద్దు వాలేతలికి పానం ఎటు బొయ్యేదో ఆయనకి నాకూ తెలవాల్చిందే. అయిపాయె రోజులే మారిపాయె. ఈ యుద్ధాలేందో ఈ కరువులేందో బెమ్మాండంగా లెగుత్తుండయి. ఇంగానయిం.

నాగరత్తమ్మగోరి కడుపు సల్లగుండి అట్టట్ట కడుపుకు యింత బెట్టి యీడే తల్దాసుకోనిత్తుండది. పానిలే పాపం రోజులు కలిసొచ్చినయి అంతేసాలు. ఎటనయినా రంగయగోరు బో తెలివిగలోడు. అట్టుండాల బుద్ధిగల మద్సుంటె. ఎరువుల యాపారం బెట్టాడూ కతే మారింది. అటనే సల్లగా వొడ్డమర బెట్టాడూ మడిచే మారిపొయ్యాడు. ఎపుడుజూసినా నవ్వుతావుంటాడు. ఊఁ సిరి దగులుకుందంటే మరట్టగాదూ? లేకుంటే ముంగలెప్పుడైనా అట్టాటి మా లావు యినుప్పెట్టె ఆవజాన గోడలో బిగదీసుండేదెట్టా? నాగరత్తమ్మగోరుకూడ యీ మద్దె సవరా అరవై రూపాల్లెక్కన సానా సవరలు కొన్నది. మొదులు రంగయగోరు ఆడోరికి సెన్నాపట్టం కాణ్ణుంచిగాని సొమ్ములు సీరెలు తెప్పియడుగా. అట తెప్పిత్తాడు గనకనే అయి ఆవజాన మెరుత్తా వుంటయి. యియాలా ఎప్పటికైనా బంగారం యెంతుండా సెడదుగానీ యీ తెల్లోడి నోటుకాయితాలు యెవుడిక్కావాలయ్యా? సెదపురుగ్గాని నుప్పుగాని తగిలిందంటే బూడ్దెబూడ్దె కావాల్సిందేగా?– రంగయ గోరి మేడకి నుప్పుగాని సెదగాని యాడా తగల్దానికి యీలే లేదనుకో. మరి నల్లరాయి సిమిటీ నూరిగాదూ కట్టిచ్చిందీ. అదిగందుకనేగా మేడ సూడను పొరుగూర్జనం ఆవజాన వచ్చిబోతా వుంటారూ. వరండాలో ముంగలా జోడు తెల్ల గుర్రాల కోసిబండిని సూత్తేనే జనం నోళ్ళు దెరుత్తారు. తోటకి మటుకు తోట్లో యెట్టాంటి పూలమొక్క లుండయి? నాగరత్తమ్మగోరు ఇసుకులేకుండా పెతోరికి సీరెలు సొమ్ములుకాణ్ణుంచి పెతిదీ సీపిచ్చుద్ది. కాదు గూడు ఎపుడన్నా పనోర్ని అట్టట్ట కేకలేసిందంటే ఆమార్తం పెద్దమద్చితరా వుండక్కర్లేదెట్టా? అట్టంటది గనకనే పనోరు ఇప్పటికీ యెప్పటికైనా అడల్గుంటారు. లేకబోతే యీ కాలం మద్చులు నీ మాటినకేం. లచ్చాదికార్లు యాడన్నా వుండారంటే ఆమార్తం బెట్టుసరి వుండదెట్టా? పానిలే. రేపిటాల మాపిటాల ఇంత పెడతావుండారు. అదే పదేలు. కాకబోతే కూడో కూడో అనరుత్తా కడుపులుగాలి మడుసులా వజాన నడీదుల్లో ఇరుసుకుబడి సత్తావుంటే యెవురయ్యా నీ కింతమాత్రం పట్టెడు కూడు గుడ్డ బట్టేది? నిన్ననంటే నిన్నేగా రోజూ గేటుకాడికొచ్చి యేం దేందో అరిసి బోతావుండే పిచ్చోడు గేటుకాడే ఆవులించి పానాలిడిసిందీ! రంగయగోరు నాయింగలోడు గనకా పిచ్చోణ్ణి వొనుకుల్లో కట్టెలేయించి ఎంటనే కాలిపించాడు. యీయన ఇట్టానే బీదోరి కేవఁన్నా ఇత్తానే వుంటాడా. యీయాల మల్లీ ఇద్దరు యానోదోరు కాలవకాడ వొంద్రుబురద్దాగి పేగులుమాడి సచ్చారంట. సిత్రంc యీడ రంగయ గోరింటో ఉండాగాబట్టి చర్పోయిందిగాని లేకుంటే నా బతుకూ అంతంత కావాల్చిందేగా?... యాఓc లే రోజు లెవురునమ్మారు? అప్పుడే పరమట్ను మడుసులు వూళ్లిడిసి యాడకో పోతుండారని కోసిబండి రాగవయ సెప్పాడు. ఎంతపంటలు సెడ్డా పంటలొచ్చిన నాలుగైదునెల్లకే ఇట్టుంటే ఇగ సమచ్చరం పొడుగుతా యెటనబ్బా! నిన్న కూడు మిగల్లేదు. సుట్టాలొచ్చారని

నాగరత్తమ్మగోరంటే, కోసి బండి రాగవయ్య ఇవకాడికొచ్చి 'ఇగ మనకీ సాగుద్ది బరాటు' అంటా వుండాడు- యేందో? నన్నీంచి యెల్లిపామంటే?... మారాజులు ఆరికేం బత్తాలు బత్తాలుండయి యెటుసేరి మా మీన వాలాల్చిందే దూడబాతులు... ఆc. అంతన్నాయం జరుగుద్దిగా ఇన్నాలూ ఆరి గడపకాడ పాసిపనీ ఆడీదా రొచ్చురొదా తీత్తా నమ్ముకొని పడుంటే? సీ పాడు, ఇదేంది నేనూ! ముంగలగా మనకి దేనికిలే నాయం పాయం తెలవందే అంటం. ఆనక బగమంతుడే వుండాడు... కోసిబండి రాగవయను సూత్తుంటేనే బయంగా వుండదే! యెపుడు జూసినా యేందో గుండె బగిలే మాటలే తెత్తావుంటాడు. 'నిన్నా మొన్నా యెవురో ఆపీచర్లొచ్చి దాన్నెం లెక్కలు తిరుగుడుగా సూత్తావుండారు. యెటుచ్చుద్దో యెవారం?' అని మద్దానమ్మించి అంటావుండాడేందీ?- అబ్బ యీ బఁఁరిపడ్డసావ అట్టరుసుద్దేం- పానీలే నాకుదేనికి... నిన్నటి నుంచి సూత్తావుండాగా ఆ గేడావు మదుసుల కల్లి అట సూసుద్దేం... కోసిబండి రాగవయ్యా అట్టనే సూత్తావుండాడు... పిచ్చోడు గేటుకాడ బిగదీసుకుబోతే ఎవికలు ఎల్లుకొచ్చినయి. యిటే తిరుగాడ్తా వుంటాడు యెగుర్తా- యెగుర్తా... ఆరికేం ఉండ మారాజులు...' సల్లగా అటనే నిదరబోయింది పాసిపని ఎంకాం, గొడ్డసాయిట్లో మూల.

**('తెలుగుతల్లి' 1946 మార్చి)**